సాక్షి
గుంటూరు
సోమవారం, 31, జూలై, 2023



పులిచింతల నీటినిల్వ
అచ్చంపేట: ఎగువ నుంచి వచ్చే వరద వల్ల పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ ఆదివారం సాయంత్రానికి 32 టీఎంసీలకు చేరింది.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం
మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి ఆదివారం భక్తుడు వీరం జోత్స్నకుమార్ రూ. 1,01,015 విరాళంగా అందజేశారు.

బగళాముఖి అమ్మకు పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖ బండ్లమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

న్యూస్‌రీల్

లలిత కళలతో మనోవికాసం



విజయవాడకల్చరల్: లలిత కళలతోనే మనో వికాసం కలుగుతుందని విద్యావేత్త డాక్టర్ ఎంసీ దాస్ అన్నారు. శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి.. దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం స్వరలయ సౌరభ సంగీత కార్యక్రమం జాతీయ స్థాయి సంగీత పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎంసీ దాస్ మాట్లాడుతూ సంగీత సాధనతో ఏకాగ్రత కలుగుతుందన్నారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ పోటీతత్వం అలవాటు చేసుకోవాలన్నారు. సుబ్రహ్మణ్య సంగీత సమితి ప్రధాన కార్యదర్శి సీవీరావు మాట్లాడుతూ ఏటా సంగీతంలోని వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో మొదటి, రెండు స్థానాలు పొందిన వారు నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. విజేతలకు ప్రశంసా పత్రం, జ్ఞాపికను నిర్వాహకులు అందజేశారు.

హంసలదీవిలో పర్యాటకుల సందడి



కోడూరు: భారీ వర్షాలు, అల్పపీడన ప్రభావంతో మూతబడిన హంసలదీవి సాగరతీరం గేట్లు ఆదివారం తెరిచారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు, అటవీ అధికారులు మూడు రోజుల నుంచి సాగరతీరాన్ని మూసి పర్యాటకుల రాకపోకలను నిషేధించారు. ఆదివారం సెలవుదినం నేపథ్యంలో తీరంలో నిషేధాజ్ఞలను అధికారులు తొలగించి పర్యాటకులను బీచ్ వద్దకు అనుమతించారు. ఇతర ప్రాంతాల నుంచి యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో సాగరతీరానికి తరలివచ్చి సందడి చేశారు. చిన్నారులు, యువకులు సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. మెరైన్ పోలీసులు తీరంలో గస్తీ నిర్వహించి, సముద్ర స్థితిగతులపై పర్యాటకులకు అవగాహన కల్పించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 515.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. కుడి కాలువకు నీటిని నిలుపుదల చేశారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 846.20 అడుగుల వద్ద ఉంది. జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి 40,644, రోజా 1,310 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

చెరువులో ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు

చిలకలూరిపేటటౌన్: చెరువులో ఈతకు వెళ్లి యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేలూరు గ్రామానికి చెందిన గండి వంశీ(24) డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం స్నేహితులతో కలసి పక్కనే కుక్కపల్లివారిపాలెం అయినగుంట చెరువులో ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో అతనితో వెళ్లిన ఇద్దరు స్నేహితులు క్షేమంగా ఒడ్డుకు చేరుకోగా వంశీ చెరువులో గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు వంశీ కోసం గాలిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి



పాత గుంటూరు: ఏటీ అగ్రహారంలోని కంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ దత్త మందిరంలో అధిక శ్రావణ మాసం పురస్కరించుకొని 11 రోజుల పాటు అనంత విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం పూర్తయిన సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో శృంగేరి విరూపాక్ష పీఠాధిపతులు శ్రీ గంభీరానందస్వామి పాల్గొని అనుగ్రహభాషణ చేశారు. విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ సంఘం, వి.జ.య. సంఘం, రామలింగ సేవా సమితి, చిలుమూరు వారి సంయుక్త నిర్వహణలో కార్యక్రమం ఏర్పాటైంది. గాయత్రీ మందిరం కమిటీ అధ్యక్షుడు రాళ్లబండి వేంకట సత్య రామాంజనేయశర్మ పర్యవేక్షించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రులు అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరావు
- అట్టహాసంగా మిర్చి యార్డు చైర్మన్ రాజనారాయణ ప్రమాణస్వీకారం



మిర్చి యార్డు ప్రమాణస్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే మద్దాళి గిరి, డొక్కా వరప్రసాద్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైస్ చైర్మన్ షేక్ మాబు సుభాని, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం మిర్చి యార్డు ఆవరణలో ఆదివారం అట్టహాసంగా జరిగింది. తొలుత నిమ్మకాయల రాజనారాయణ, మాబు సుభాని, పాలకవర్గ సభ్యులు బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రీజినల్ కార్యాలయం నుంచి లక్ష్మీపురం, అంబేడ్కర్ సెంటర్, శంకర్ విలాస్, మార్కెట్ సెంటర్, జీటీ రోడ్, చుట్టుగుంట సెంటర్ మీదుగా మిర్చి యార్డు వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో బలహీనవర్గాలను గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్ యార్డుకు ఒక బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన రాజనారాయణను నియమించడం అభినందనీయమన్నారు. కార్పొరేషన్ పదవులు, ఎమ్మెల్సీలలో 50 శాతం పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. మంత్రి పదవుల్లోనూ 56 శాతం బడుగు, బలహీన వర్గాలకు కేటాయించారని గుర్తుచేశారు. చంద్రబాబు పాలనలో పేద విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులు చదివిన దాఖలాలు లేవని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంత ఉంటే అంత చెల్లించి ఎంతో మంది పేద విద్యార్థులను ఇంజినీర్లు, డాక్టర్లుగా తయారు చేశారని కొనియాడారు. చంద్రబాబు హయాంలో పేదరికం 11.10 శాతం ఉంటే, నేడు 6 శాతానికి తగ్గించిన ఘనత జగన్‌కే దక్కుతోందన్నారు. దోచుకో.. దాచుకో.. పంచుకో అన్న చందంగా చంద్రబాబు పాలన సాగిందని ఎద్దేవా చేశారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్ రాజనారాయణ చిత్రంలో వైస్ చైర్మన్ సుభాని

అక్షరాస్యతలో మూడో స్థానం

గతంలో అక్షరాస్యతలో రాష్ట్రం దేశంలో 15వ స్థానంలో ఉండేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి వల్ల నేడు 3వ స్థానానికి చేరుకుందని మంత్రులు పేర్కొన్నారు. నూతన పాలకవర్గం రైతులకు అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో ప్రజలకు సేవలందించే వలంటీర్, సచివాలయ వ్యవస్థలపై ప్రతిపక్షాలు దాడి చేస్తున్నాయని ధ్వజమెత్తారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనంతో ప్రజలు బెంబేలెత్తిపోయారన్నారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తప్పుబట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంటే ప్రతిపక్షాలు విషం చిమ్ముతున్నాయన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.2.30 లక్షల కోట్లు నేరుగా పేదల ఖాతాల్లో జమ చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రశంసించారు. మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటు వేయాలని కోరుతున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని స్పష్టం చేశారు.

పేదల కన్నీళ్లు తుడిచే సీఎం జగన్

నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ గుంటూరు మార్కెట్ యార్డును నూతన పాలకవర్గం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని కోరారు. దీనికి తమవంతు సహకారం ఉంటుందని చెప్పారు. ఎమ్మెల్యేలు షేక్ మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా కొత్త పాలకవర్గం పని చేయాలని కోరారు. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ పేదల కన్నీళ్లు తుడిచే సీఎం జగన్‌కు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం మర్రి రాజశేఖర్, జంగా కృష్ణమూర్తి, డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ తండ్రి బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుపక్షపాతిగా నిలుస్తున్నారని కొనియాడారు.

మిర్చి యార్డు అభివృద్ధికి కృషి

మిర్చి యార్డు కొత్త చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ అందరి సహకారంతో యార్డును అభివృద్ధి పథంలో నడుపుతామని చెప్పారు. దేశంలోనే మొదటి స్థానం సాధించేందుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ హయాంలో కొన్ని వర్గాలకే న్యాయం జరిగిందని పేర్కొన్నారు. టీడీపీ పాలనలో నష్టపోయిన వారు రాష్ట్రంలో వేలాది మంది ఉన్నారని, అందులో తానూ ఒకడినన్నారు. తనపై ఎంతో నమ్మకంతో మిర్చి యార్డు చైర్మన్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాదాభివందనాలని రాజనారాయణ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, మార్కెటింగ్, సహకార శాఖల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, తాడిశెట్టి మురళి, డైమండ్‌బాబు, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, మిర్చి యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

3 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు



నల్లపాడులోని హెల్ప్‌లైన్ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీసెట్–2023 ద్వారా ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. ఈఏపీ సెట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు భౌతికంగా హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయిన విద్యార్థులు ఆగస్టు 3 నుంచి ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాల్సి ఉంది. దీని కోసం ఎస్‌ఈటీఎస్.ఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌కు లాగిన్ కావాలి. ఆప్షన్ల నమోదుకు 8వ తేదీ వరకు అవకాశం ఉంది. 9వ తేదీలోపు ఆప్షన్లు మార్చుకోవచ్చు. 12న సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 40 ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు 22,290 సీట్లు అందుబాటులో ఉన్నాయి. సీటు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో అలాట్‌మెంట్ ఆర్డర్ డౌన్‌లోడ్ చేసుకుని ఆగస్టు 13, 14వ తేదీల్లో కళాశాలల్లో రిపోర్టు చేయాలి. 16న కళాశాలల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి. గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంతోపాటు నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటివద్ద ఆన్‌లైన్ సదుపాయం లేని విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదుకు ఈ హెల్ప్‌లైన్ కేంద్రాలకూ వెళ్లవచ్చు.

పరాశక్తి లలితా.. శివానంద చరితా..



దుర్గమ్మను దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

- ఇంద్రకీలాద్రిపై ఆదిదంపతులు ఆర్జిత సేవలకు డిమాండ్
- మహామండపం మీదుగా రాకపోకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పరాశక్తి లలితా.. శివానంద చరితా అంటూ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను భక్తజనం కనులారా తిలకించి మనసారా ప్రార్థించారు. ఆదివారం మూలా నక్షత్రం పురస్కరించుకుని కనకదుర్గమ్మను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. మరో వైపున అమ్మవారి దర్శనానికి సాధారణ రద్దీ కనిపించింది. అమ్మవారి దర్శనం గంటలోనే పూర్తి కాగా, భక్తులు కుటుంబ సమేతంగా ఆలయ ప్రాంగణంలో గడిపారు. కొండరాళ్లు జారిపడే అవకాశం ఉండటంతో ఆలయ అధికారులు ఘాట్‌రోడ్డును మూసివేశారు. మహామండపం మీదుగా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. దర్శనం తర్వాత మల్లేశ్వరస్వామి ఆలయం మీదుగా కొండ దిగువకు చేరుకున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సరస్వతీయాగం

మూలా నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారి సన్నిధిలో సరస్వతీయాగం చేశారు. తొలుత కలశ స్థాపన, అనంతరం యాగాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

సూర్యోపాసన సేవ

లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సూర్యోపాసన సేవ చేశారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతించారు.

ఆర్జిత సేవలకు డిమాండ్

శ్రీదుర్గామల్లేశ్వరస్వామికి నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.



సరస్వతీ యాగంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

తెల్లవారుజామున అమ్మవారికి జరిగిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణం, నవగ్రహ హోమాల్లో ఉభయదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి గంట సమయం పట్టింది.

మహా మండపం మీదుగా కొండపైకి

గత వారం కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో దుర్గగుడి ఘాట్‌రోడ్డును మూసివేసిన సంగతి తెలిసిందే. ఆదివారం కూడా ఘాట్‌రోడ్డును మూసివేసిన దేవస్థాన అధికారులు, మహామండపం మీదుగానే భక్తులను కొండపైకి అనుమతించారు. మహామండపం మెట్లు, లిఫ్టు ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వదర్శనం, రూ.100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. ఘాట్‌రోడ్డును మూసివేయడంతో చైనా వాల్, ఓం టర్నింగ్, లక్ష్మీ గణపతి ప్రాంగణాలు వెలవెలబోయాయి. ఆదివారం రాత్రి కూడా వర్షం కురవకపోతే సోమవారం ఘాట్‌రోడ్డును తెరిచే అవకాశాలున్నాయని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

కుడి కాలువకు నీరు నిలిపివేత

విజయపురిసౌత్: కృష్ణానది యాజమాన్య బోర్డు ఈనెల 20న తాగునీటి అవసరాల నిమిత్తం ఐదు టీఎంసీల నీటిని నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు కేటాయించింది. నీటి విడుదల పూర్తి కావటంతో కుడి కాలువకు ఆదివారం అధికారులు నీటిని నిలిపివేశారు. మధ్యాహ్నం కుడి కాలువకు విడుదలవుతున్న 4,848 క్యూసెక్కులను ఒంటి గంట నుంచి గంటకు 1,000 క్యూసెక్కుల చొప్పున



తగ్గిస్తూ సాయంత్రం ఐదు గంటలకు పూర్తిస్థాయిలో నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 515.10 అడుగుల వద్ద ఉండగా ఇది 140.4917 టీఎంసీలకు సమానం.

రైలు ఢీకొని తల్లీకూతుళ్లు మృతి

నెల్లూరు(క్రైమ్): మూత్ర విసర్జనకు పట్టాల మీద నడుచుకుంటూ వెళ్తున్న తల్లీకూతుళ్లు రైలు ఢీకొనడంతో మృతి చెందారు. ఈ హృదయ విదారక ఘటన ఆత్మకూరు బస్టాండు సమీపంలో రైలు పట్టాలపై ఆదివారం సాయంత్రం జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు..

గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన ఫాతిమా అలియాస్ ఫాతిమున్నీసా(60)కు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ వివాహమైంది. పెద్ద కుమార్తె మెహరున్నీసా శింగరాయకొండ, చిన్న కుమార్తె గౌసియా(35) కందుకూరులో ఉంటున్నారు. రొట్టెల పండగకు తల్లీకూతుళ్లు కలిసి ఆదివారం పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరుకొచ్చారు. దర్గాను సందర్శించుకుని హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఈ క్రమంలో మెహరున్నీసా రైల్వేస్టేషన్‌లో ఉండగా ఫాతిమున్నీసా, గౌసియా మూత్రవిసర్జన చేసేందుకు రైలుపట్టాల వెంబడి ఆత్మకూరు బస్టాండ్ వైపు వెళ్లారు. రైల్వే బ్రిడ్జి సమీపంలోకి వచ్చేసరికి నిజాముద్దీన్ వెళ్తున్న రైలు వారిని ఢీకొంది. ఫాతిమున్నీసా అక్కడికక్కడే మృతి చెందగా గౌసియా రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయమైంది. గాయాలపాలైన ఆమెను స్థానికులు 108 సాయంతో చికిత్స నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గౌసియా మృతి చెందింది. తల్లి, చెల్లెలు మృతితో మెహరున్నీసా కన్నీటిపర్యంతమై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఘటనా స్థలాన్ని రైల్వే ఎస్సై ఎన్.హరిచందన పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు నెల్లూరుకు బయలు దేరారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.



ఘటనా స్థలంలో ఫాతిమున్నీసా మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్ఐ హరిచందన

పికెట్ ఏర్పాటు

గతంలోనూ ఇదే ప్రాంతంలో ఈ తరహా ఘటనలు చోటుచేసుకున్నాయి. రైల్వే పోలీసులు గస్తీని ఏర్పాటు చేసి అటువైపు వెళ్లొద్దని ఆదేశాలు జారీ చేస్తున్నా.. ప్రయాణికులు పెడచెవిన పెట్టి రైలు పట్టాలపై రాకపోకలు సాగిస్తూనే ఉన్నారు. ఆదివారం తల్లీకూతుళ్లు రైలుపట్టాలపై వెళుతుండగా, అటుగా వెళుతున్న వారు వారిస్తుండగానే రైలు వారిని ఢీకొంది. దీంతో రైల్వే పోలీసులు అక్కడ పికెట్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులు అటుగా వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

ఎంఈఓ కార్యాలయ విభజన ఎప్పుడో!

- గుంటూరు నగరంలో ఏకైక కార్యాలయం
- తూర్పు, పశ్చిమ ఎంఈఓలుగా విభజించిన ప్రభుత్వం
- గుంటూరు వెస్ట్‌లోని కార్యాలయం నుంచే మొత్తం పరిపాలన



గుంటూరులోని ఎంఈఓ కార్యాలయం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు అర్బన్ ఎంఈఓ కార్యాలయాల విభజనపై విద్యాశాఖ దృష్టి సారించడం లేదు. పాఠశాలలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ, పరిపాలనా సౌలభ్యం, ఎంఈఓలపై అధిక పనిభారాన్ని నివారిస్తూ ప్రభుత్వం సృష్టించిన రెండో ఎంఈఓ పోస్టుల ద్వారా మండల విద్యాశాఖాధికారులకు ఉపశమనం కలిగింది. అయితే గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకర్గాలతో పాటు ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే రూరల్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గుంటూరు అర్బన్ ఎంఈఓ పరిధిలోకి వస్తున్నాయి.

రెండో ఎంఈఓ పోస్టును మంజూరు చేయక ముందు గుంటూరు అర్బన్, రూరల్ మండలాలకు కలుపుకొని వందలాది పాఠశాలల వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కేవలం ఒక్కరే ఎంఈఓ అన్ని బాధ్యతలను నిర్వర్తించారు. అయితే తాజాగా ప్రభుత్వం మంజూరు చేసిన రెండో ఎంఈఓ పోస్టును కలుపుకొని గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వారీగా ప్రస్తుతం నాలుగు ఎంఈఓ పోస్టులు ఉన్నాయి. వీటిలో నలుగురు ఎంఈఓలు జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా నలుగురు ఎంఈఓలకు ఒకే కార్యాలయం ఉండటంతో విధుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పర్యవేక్షణ అంతా ఒక్క కార్యాలయం నుంచే..

రాష్ట్ర వ్యాప్తంగా నగరపాలకసంస్థల్లో అర్బన్ ఎంఈఓ పోస్టులను భర్తీ చేయడంలో భాగంగా అదనంగా మంజూరు చేసిన 13 పోస్టుల్లో గుంటూరు అర్బన్ ఎంఈఓ పోస్టు సైతం ఉంది. గుంటూరు నగర, రూరల్ మండల పరిధిలోని 205 ప్రభుత్వ పాఠశాలలతో పాటు మరో 300 ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు ఒక్క ఎంఈఓ కార్యాలయం నుంచే జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్‌లను పాఠశాలలకు పంపి, విద్యార్థులకు పంపిణీ చేయడం, పాఠ్య పుస్తకాలను సకాలంలో సరఫరా చేయడంతో పాటు ప్రభుత్వ నిబంధనలను ప్రైవేటు పాఠశాలలు ఖచ్చితంగా అమలు చేస్తున్నదీ, లేనిదీ పర్యవేక్షించే విధులను ఎంఈఓలు నిర్వహించాల్సి ఉంది.

వేర్వేరు కార్యాలయాలతో మేలు..

జిల్లా కేంద్రం కావడంతో పాటు పెద్ద సంఖ్యలో పాఠశాలలు ఉండటంతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కొత్తగా ఎంఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. పరిపాలనా సౌలభ్యం కోసం తూర్పులో నూతనంగా ఎంఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి సైతం తీసుకెళ్లారు. నలుగురు ఎంఈఓలు ఒకే కార్యాలయం నుంచి పరిపాలన సాగిస్తున్న దృష్ట్యా, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఎంఈఓ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు సైతం కోరుతున్నారు.

క్లుప్తంగా

కొండవీటి చరిత్రపై అవగాహన అవసరం



ఫిరంగిపురం: కొండవీటి రెడ్డిరాజుల చరిత్రపై అవగాహన అవసరమని కొండవీటి కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె.శివారెడ్డి అన్నారు. మండలంలోని హౌస్ గణేష్ గ్రామ పరిధిలోని కొండవీటి రెడ్డి రాజుల మ్యూజియాన్ని ఆదివారం కాకినాడ రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సందర్శించారు. వారికి రెడ్డిరాజుల ప్రాశస్త్యాన్ని, విశిష్టతను శివారెడ్డి వివరించారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన వస్తువులు, కోట నమూనాలు, రెడ్డిరాజుల కాలంనాటి సామగ్రి, నాణేలు, కత్తులు, ఆభరణాలు, వంటపాత్రలు, రెడ్డిరాజుల విగ్రహాలు వారిచరిత్రను గురించి తెలియజేశారు.

డాక్టర్ తేజశ్వికి గోల్డ్ మెడల్



గుంటూరు మెడికల్: గుంటూరు నగరంలో కార్డియాలజిస్ట్‌గా సేవలందిస్తున్న డాక్టర్ జె.తేజశ్వికి డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ గోల్డ్ మెడల్ లభించింది. డీఎం కార్డియాలజిస్ట్ కోర్సులో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచినందుకు వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు గోల్డ్‌మెడల్ అందజేశారు. అత్యాధునిక కార్డియాలజీ వైద్యసేవలను ప్రజలందరికీ చేరువ చేస్తానని డాక్టర్ తేజశ్విని తెలిపారు. గోల్డ్ మెడల్ అందుకున్న డాక్టర్ తేజశ్వినికి ఆమె భర్త, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్, తల్లిదండ్రులు రామకోటేశ్వరరావు, విజయ, సోదరుడు రవితేజ హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



పాత గుంటూరు: నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణయ్య అన్నారు. ఆదివారం పాత గుంటూరులోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు దేవ ప్రసాదరావు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రమణయ్య మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. వెనుకబడిన వర్గాల వారికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు నారాయణస్వామి, వివిధ జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఫోన్ పోయినా.. హాయ్!

- బాధితులకు బాసటగా 'సీఈఐఆర్' వెబ్‌సైట్
- ఇప్పటికే వందల్లో మొబైల్‌ఫోన్లు అప్పగింత

నగరంపాలెం: గతంలో ఏదైనా మొబైల్‌ఫోన్ పోగొట్టుకుంటే దొరికేదికాదు.. ఇక పోయిన ఫోన్ దొరుకుతుందన్న ఆశ కూడా ఉండేదికాదు.. కష్టమైనా.. మరో కొత్త ఫోన్ కొనుగోలు చేయాల్సి వచ్చేది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతుంది. ఆధునిక పద్ధతిలో పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను మళ్లీ బాధితులకు పోలీసులకు అప్పగిస్తున్నారు.

జనవరిలో 'హాయ్'..

మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల కోసం గుంటూరు జిల్లా పోలీస్ ప్రత్యేక వాట్సాప్ నంబర్ 86888 31574 జనవరిలో తీసుకొచ్చారు. వాట్సాప్ నంబర్‌కు 'హాయ్' అని మెసెజ్ పంపిస్తే, లింక్ మేసేజ్ వచ్చేది. లింక్ ఓపెన్ చేసి వివరాలు చెప్పాలి. ఫోన్‌ను ఐటీ కోర్ విభాగం పోలీసులు ట్రాక్ చేసి అప్పగించేవారు. ఈ పక్రియను ఎప్పటికప్పుడు నోడల్ అధికారిణి, ఏఎస్పీ సుప్రజ పర్యవేక్షిస్తారు. ఇప్పటిదాకా వందల్లో పోగొట్టుకున్న ఫోన్లను అప్పగించారు. ఈ వాట్సాప్ నంబర్‌తోపాటు సీఈఐఆర్ అనే వెబ్‌సైట్‌ను గతనెలలో అందుబాటులోకి తీసుకొచ్చారు.

సీఈఐఆర్‌ను కూడా..


ఇటీవల కేంద్ర ప్రభుత్వ టెలికాం మంత్రిత్వ శాఖ సహకారంతో సిఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ – www.ceir.gov.in) అనే వెబ్‌సైట్ ద్వారా గుంటూరు జిల్లాలో పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను గుర్తించే పక్రియను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ వెబ్‌సైట్ ద్వారా పోగొట్టుకున్న / పోయిన మొబైల్‌ఫోన్లను వాడుతున్నట్లయితే 24 గంటల్లోపు గుర్తించవచ్చు. అలాగే ఫోన్లల్లో నిక్షిప్తమైన వ్యక్తిగత సమాచారం దుర్వినియోగంకాకుండా ఫోన్ బ్లాక్ చేయవచ్చు.

సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు ఇలా..

- మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు ముందుగా స్థానిక పోలీస్‌స్టేషన్లల్లో ఫిర్యాదివ్వాలి.
- అనంతరం www.ceir.gov.in అనే వెబ్‌సైట్‌లో లాగిన్ అవాలి.
- అందులో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్/ స్టోలెన్ అనే లింక్‌పై క్లిక్ చేసి, సెల్‌ఫోన్ నంబర్, ఐఎంఈఐ నంబర్, కంపెనీ పేరు, మోడల్, మొబైల్‌ఫోన్ కొనుగోలు సంబంధించి రశీదు (బిల్లు)ను అప్‌లోడ్ చేయాల్సి ఉంది.
- దీంతోపాటు మీ మొబైల్‌ఫోన్ ఏ రోజు, ఎక్కడ పొగొట్టుకున్నారు, రాష్ట్రం, జిల్లాతోపాటు పీఎస్‌లో ఫిర్యాదిచ్చిన వివరాలు నమోదు చేయాలి.
- పోగొట్టుకున్న సిమ్ కార్డు మళ్లీ తీసుకోవాలి. సిమ్ కార్డుకు కంప్లయింట్ ఓటీపీ వస్తోంది.
- పోలీస్‌స్టేషన్లల్లో యిచ్చిన కంప్లయింట్ కాపీని సీఈఐఆర్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది.
- బాధితుని పేరు, చిరునామా, గుర్తింపు కార్డు (ఆధార్, ఓటరు, ఐడీ, పాన్, ప్రభుత్వం గుర్తింపు పొందినవి) ఈ– మెయిల్ ఐడీ పూర్తి వివరాలు నమోదు చేయాలి.
- ఇది పూర్తయ్యాక ఒక ఐడీ నంబర్ వస్తుంది. ఆ ఐడీతో ఫోన్ స్టేటస్‌ను తెలుసుకోవచ్చు.
- ఈ సీఈఐఆర్ వ్యవస్థ ద్వారా పాగోట్టుకున్న/ పోయిన మొబైల్‌ఫోన్ ఏ కంపెనీదైనా 24 గంటల్లోపు ఫోన్ పని చేయకుండా ఆపేయచ్చు.
- సెల్‌ఫోన్ దొరికిన అనంతరం బాధితుడు అదే వెబ్‌సైట్‌లోకి వెళ్లి అక్/ ఫౌండ్ మొబైల్ అనే లింక్‌పై క్లిక్ చేసి, ఐడీ నమోదు చేయగానే ఫోన్ అన్‌బ్లాక్ అవుతుంది.



పోగొట్టుకున్న ఫోన్లను తీసుకున్న వారితో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీ సుప్రజ (ఫైల్)



సీఈఐఆర్ వెబ్‌సైట్

సీఈఐఆర్‌పై అవగాహన

సెల్‌ఫోన్లు వినియోగించే ప్రతి ఒక్కరికి సీఈఐఆర్ వ్యవస్థపై సబ్ డివిజన్లల్లో, సర్కిల్ పరిధిలో, పోలీస్‌స్టేషన్లలో పోలీస్ సిబ్బంది ఇప్పటికే అవగాహన కల్పించాం. మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే బాధితులు స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలి. సీఈఐఆర్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.ఆరిఫ్‌హఫీజ్, గుంటూరు జిల్లా ఎస్పీ

పోయిన ఫోన్ దొరికింది..

జూన్ 13న నా ఫోన్ పోయింది. వెంటనే నగరంపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేశా. సీఈఐఆర్ వెబ్‌సైట్‌పై అవగాహన కల్పించారు. అందులో పేరు, ఫోన్ నంబర్, మోడల్, తదితర వివరాలను అప్‌లోడ్ చేశాను. రెండు వారాల క్రితం దొరికిన నా ఫోన్‌ను అప్పగించారు. సంతోషంగా ఉంది.

– రషీదాబేగం, నగరంపాలెం

నేడు ఉద్యోగ విరమణ చేయనున్న ఆర్డీ డాక్టర్ యాస్మిన్



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు(ఆర్డీగా) గా, లెప్రసీ అడిషనల్ డైరక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ జూలై 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. గుంటూరుకు చెందిన డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ గుంటూరు వైద్య కళాశాలలో 1978లో ఎంబీబీఎస్ చదివారు. కృష్ణాజిల్లా ఈదుల్లపాడులో 1987లో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరి ప్రభుత్వ సర్వీస్‌లోకి ప్రవేశించారు. ఇన్‌సర్వీస్ కోటాలో గుంటూరు వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యలో డీసీహెచ్‌ను 1998లో పూర్తిచేశారు. డిప్యూటీ ఆర్‌ఎంఓగా పదోన్నతిపొంది గుంటూరు జీజీహెచ్‌లో 2006లో విధుల్లో చేరి ఐదేళ్లపాటు పనిచేశారు. సివిల్ సర్జన్‌గా ఉద్యోగోన్నతి పొంది 2011లో నల్లపాడు ప్రాంతీయ మహిళా శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా చేరారు. తదుపరి 2014లో ప్రకాశం డీఎంహెచ్ఓగా బదిలీ పై వెళ్లి మూడేళ్లపాటు బాధ్యతలు నిర్వహించారు. గుంటూరు డీఎంహెచ్ఓగా 2017లో విధుల్లో చేరి సుమారు ఐదేళ్లపాటు ఇక్కడ పనిచేశారు. అనంతరం జాయింట్ డైరక్టర్‌గా 2022లో పదోన్నతి పొందారు. గుంటూరు జీజీహెచ్‌లో డెప్యూటీ ఆర్ఎంఓగా, ప్రకాశం, గుంటూరు డీఎంహెచ్ఓగా పనిచేస్తున్న సమయంలో పలుమార్లు అవార్డులు అందుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా 2017లో ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. కోవిడ్ సమయంలో గుంటూరు జిల్లాలో ఆమె రెండుసార్లు కోవిడ్ బారినపడి కూడా సమర్ధవంతంగా విధులు నిర్వహించి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. గుంటూరు మెడికల్ కాలేజ్ ఎదురుగా ఉన్న ఏపీఎన్జీఓ కల్యాణ మండపంలో సోమవారం డాక్టర్ యాస్మిన్ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని ఆర్డీ కార్యాలయ సిబ్బంది నిర్వహిస్తున్నారు. డాక్టర్ యాస్మిన్ భర్త డాక్టర్ బి.వెంకటేశ్వరరావు గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతిగా, గుంటూరు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసి గత ఏడాది ఉద్యోగ విరమణ చేశారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సభలో మాట్లాడుతున్న నాగబ్రహ్మచారి

పాత గుంటూరు: విద్యుత్ సంస్థలలో వేతన సవరణకై కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణకు, ఇతర ప్రధాన సమస్యల పరిష్కారానికై విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఐక్య కార్యాచరణ కమిటీలు ఆగస్టు 10వ తేదీ తరువాత సమ్మె నిర్వహించాలని పిలుపునిచ్చాయి. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సభకు కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ నాగబ్రహ్మచారి అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులపై ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం చిన్నచూపు చూస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31వ తేదీ జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఆగస్టు 2వ తేదీ ఎస్ఈ ఆఫీసుల వద్ద ర్యాలీ నిర్వహించాలని, ఆగస్టు 10నుంచి సమ్మెలోకి వెళ్లాలని, ఆగస్టు 17వ తేదీన చలో విద్యుత్ సౌధ నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న ఈ పోరాటాలకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు, ఉద్యోగసంఘం నాయకులు, వీవీకే సురేష్, కిషోర్, సలీమ్, జి.వెంకట్రావు, దాసరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆపస్ జిల్లా అధ్యక్షుడిగా బాల చంద్రారెడ్డి



బాల చంద్రారెడ్డి, శ్రీనివాసరావులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాల చంద్రారెడ్డి, శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు. ఆదివారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ఆపస్ జిల్లా అభ్యాసవర్గ సమావేశంలో భాగంగా జిల్లా శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బలరామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల అనంతరం కేడర్ స్ట్రెంగ్త్ అంశం గత రెండు నెలలుగా విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని, ఫలితంగా వేలాది మంది ఉపాధ్యాయులు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థికపరమైన బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు. డీవైఈఓ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎఫ్ఏ–1 పరీక్షల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో దేనిని ఎంపిక చేసుకోవాలనే స్వేచ్ఛ విద్యార్థులకు ఇవ్వాలని కోరారు. సంఘం రాష్ట్ర కోశాధికారి ఎ.సురేష్‌కుమార్, జి.శ్రీనివాసరెడ్డి, డి.శ్రీనివాసరావు, వై.వీరబాబు, పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నరసరావుపేట: విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలను యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాయకులు ఎం.సుబ్బారెడ్డి కోరారు. కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు జే రాజశేఖర్ అధ్యక్షతన ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగులకు 45శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలు చేయాలన్నారు.



గుంటూరు మిర్చి యార్డు పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవం మిర్చి యార్డులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సభ్యులతో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ప్రమాణం చేయించారు.
-సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గొరిజవోలులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

నాదెండ్ల: భారత దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన దార్శనికుడు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని గొరిజవోలు ఎస్సీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ, విభిన్న కులమతాలతో భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న భారతదేశానికి సమగ్రమైన రాజ్యాంగం అందించి దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు దోహదపడిన మహనీయుడు అని అన్నారు. కుల వివక్ష, అంటరానితనం రూపుమాపేందుకు పోరాటం చేశారన్నారు. ఎంతో ముందుచూపుతో ఆయన రిజర్వేషన్లను ఏర్పాటు చేసి అన్ని వర్గాల్లో సమాజంలో సమానంగా ఎదిగేందుకు దోహదపడ్డారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రజలు పాటుపడాలని, సుసంపన్న భారతదేశాన్ని నిర్మించేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, చిలకలూరిపేట మార్కెట్‌యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, గణపవరం, నాదెండ్ల సొసైటీల అధ్యక్షులు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, నాయకులు అల్లడి రవికుమార్, కె రామకృష్ణయ్య, పత్తి వెంకట్, పర్వతనేని బ్రహ్మయ్య, మొక్కపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహనీయుడు...

వందేళ్లగా కుల వివక్ష, అంటరానితనానికి గురైన జాతులను విముక్తం చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ మారుపూడి విక్టర్ ప్రసాద్ చెప్పారు. గొరిజవోలు గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్న దళితులకు హక్కులు ప్రసాదించి, అన్ని రంగాల్లో ఎదిగేందుకు ఏర్పాట్లు చేసిన దార్శనికుడు అంబేడ్కర్ అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దళిత బహుజనులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించారని వివరించారు. అనంతరం విక్టర్ ప్రసాద్‌ను స్థానికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచి గొర్రెపాటి గృహలక్ష్మి, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీటీసీ గారపాటి సుహాసిని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ జంగం చంద్రశేఖర్, జంగం బాజి, కంచడం శివ, శ్యామ్‌పాల్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

భక్తిశ్రద్ధలతో మొహర్రం

యడ్లపాడు: కుల, మతాలకు అతీతంగా జరుపుకొనే మొహర్రం సంతాప దినాలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని తిమ్మాపురం, బోయపాలెం, కారుచోల, యడ్లపాడు, కొండవీడు, కోట గ్రామల్లో ఆరు రోజులుగా భక్తుల నుంచి మొక్కుబడులు చెల్లించుకున్న పీర్ల చావిళ్ల నుంచి పంజాలు నిమజ్జనం నిమిత్తం ఏటికి తరలివెళ్లాయి. చివరిరోజు కార్యక్రమం కొండవీడు, కోట గ్రామాల్లో అశేష భక్తుల నడుమ ఎంతో భక్తిభావంతో జరిగింది. పదో రోజు కార్యక్రమంలో అర్ధరాత్రి అగ్నిగుండం చుట్టూ తిరుగుతూ అలాయిబలాయి ఆడారు. మరుసటి రోజు అగ్నిగుండాలను పూడ్చారు. రెండు రోజుల పాటు ముస్లింలతో పాటు హిందూవులు ఉపవాస దీక్షల్ని చేపట్టారు. కొంతమంది పీర్ల చావిళ్ల వద్ద షర్బత్‌ను పంపిణీ చేశారు. యుద్ధంలో అమరులైన మొహమ్మద్ ప్రవక్త మనవలు హసన్, హుసేన్ త్యాగాలను స్మరించుకున్నారు.

మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి



పొన్నూరులో శాంతి ర్యాలీ చేస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు



చేబ్రోలులో జరిగిన శాంతి ర్యాలీలో దళిత నాయకులు

మణిపూర్ ఘటనను నిరసిస్తూ.. పొన్నూరు, చేబ్రోలులో భారీ ర్యాలీలు

చేబ్రోలు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన అమానుష దాడులను ఖండిస్తూ పొన్నూరు, చేబ్రోలు ప్రాంతాల్లో ఆదివారం దళిత, ముస్లిం సంఘాలు, ప్రజా సంఘాలు, పాస్టర్స్ ఫెలోషిప్, లౌకికవాదులు, మానవతా వాదుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులు, జాతీయ జెండా పట్టుకొని సంఘీభావ శాంతి ర్యాలీ నిర్వహించారు. చేబ్రోలు మండలంలో నారాకోడూరు నుంచి చేబ్రోలు వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. పొన్నూరు అంజుమన్ కమిటీ, యునైటెడ్ ఫ్రంట్, నిడుబ్రోలు– పొన్నూరు పాస్టర్స్ ఫెలోషిప్, దళిత మహాసభ, మాల మహాసభ, ఈబీహెచ్, ఏఈఎల్సీ, ప్రజా సంఘాలు, దళితులు. ముస్లింలు, మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు, పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పొన్నూరు, చేబ్రోలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో పలువురు వక్తలు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై అమానుష హత్యాకాండకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికార మదంతో దౌర్జన్యాలకు పాల్పడుతున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదులకు రానున్న కాలంలో తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ఫాదర్ ఎల్ఎక్స్, మౌలానా అల్తాఫ్ మురాది, షేక్ సైపుల్లా, షేక్ మహమ్మద్ (మాము), రెవరెండ్ కె.ఆశీర్వాదం, డాక్టర్ టి.రాజారావు, జక్కా శ్రీనివాస్, ఫాదర్ రామారావు, నాజర్, మల్లెల వెంకట్రావు, అక్కిదాసు జాషువా, జోసఫ్, ఆరేటి రామారావు, మనోరంజని పాల్గొన్నారు. సభలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు, ముస్లిం, క్రైస్తవ మహిళలు, మానవతా వాదులు, లౌకికవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.